రేపల్లె పాసింజర్.. మళ్లీ ఆగుతుందా..?!

- హాల్ట్ కోసం ఎదురుచూస్తున్న సామాన్య ప్రజలు
- నాలుగేళ్ల నుంచి పట్టించుకోని అధికారులు
- హాల్ట్ కల్పిస్తే ఇరవై గ్రామాల ప్రజలకు ప్రయోజనం
- పాలకులు హాల్ట్ కోసం కృషి చేయాలి



రెడ్డిగూడెం రైల్వే స్టేషన్

రాజుపాలెం: రేపల్లె పాసింజర్ రైలుకు హాల్ట్ లేక పోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సికింద్రాబాద్–హైదరాబాద్ వెళ్లి రావాలంటే సామాన్యులకు, విద్యార్థులకు ప్రయాణ ఖర్చులు భారమయ్యాయి. పాసింజర్ రైలుపై ఆధారపడి జీవనం సాగిస్తున్న హాకర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. పూట గడవడం కష్టంగా ఉందని హాకర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకెళితే మండలంలోని రెడ్డిగూడెం రైల్వే స్టేషన్‌లో గత నాలుగేళ్ల నుంచి రేపల్లె పాసింజర్ ఆగడం లేదు. కరోనా సమయంలో దేశం మొత్తం లాక్ అవుట్ అమలు చేయడంతో ఆ సమయంలో పాసింజర్ రైలును నిలిపివేసారు. మరలా పునః ప్రారంభించినప్పుడు రెడ్డిగూడెం రైల్వే స్టేషన్‌కు రైల్వే అధికారులు హాల్ట్‌ను ఎత్తివేశారు. దీంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఖర్చులు తగ్గుతాయి

కరోనా సమయంలో హాల్ట్‌ను ఎత్తివేసిన దగ్గర నుంచి మండలంలోని ప్రజలు, నాయకులు రైల్వే అధికారులకు ఎన్ని వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదు. ఇచ్చిన వినతి పత్రాలను బుట్టదాఖలు చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు చెప్పినా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రెడ్డిగూడెం స్టేషన్‌ను అన్ని హంగులతో ఆధునీకరించడంతో పాటు మూడు లైన్‌లు ఏర్పాటు చేశారు. పంచాయతీ అధికారులు పంచాయతీ ఖర్చులతో గ్రామం నుంచి రాకపోకలకు అనువుగా ఉండేందుకు రైల్వే స్టేషన్‌కు సీసీ రోడ్డుతో పాటు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఇన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసిన పాసింజర్ రైలుకు హాల్ట్ కల్పించకపోవడంపై రెడ్డిగూడెం గ్రామస్తులు అధికారులపై మండి పడుతున్నారు. రెడ్డిగూడెం స్టేషన్‌లో హాల్ట్ ఏర్పాటు చేస్తే సుమారు 20 గ్రామాలకు ఉపయోగకరంగా ఉంటుందని, ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు హైదరాబాద్–సికింద్రాబాద్ వెళుతుంటారు. హాల్ట్ ఇస్తే వారికి ప్రయాణ ఖర్చులు తగ్గుతాయని కోరుతున్నారు.


స్టేషన్‌లో ఏర్పాటు చేసిన రైల్వే లైన్‌లు

రోడ్డున పడ్డ హాకర్లు

గతంలో రెడ్డిగూడెం స్టేషన్‌లో హాల్ట్ ఉండడం వలన రెడ్డిగూడెంకు సంబంధించిన 60 నుంచి 70 కుటుంబాలకు చెందిన హాకర్లు రైలులో వ్యాపారం చేస్తుంటారు. హాల్ట్ తీసివేయడంతో ఆ కుటుంబాల వారికి పూట గడవడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాల్ట్ కల్పించినట్లయితే మాకు భుక్తి పెట్టినవారవుతారని రైల్వే అధికారులను కోరుతున్నారు.

బస్సు చార్జీలు భరించడం కష్టం



పేద, మధ్య తరగతి ప్రజలకు బస్సు చార్జీలను భరించడం కష్టంగా ఉంది. ఇక్కడ రైల్వే హాల్ట్ లేకపోవడం వలన ఇరవై గ్రామాలకు చెందిన ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైల్వే అధికారులు హాల్ట్ కల్పించాలి. పాసింజర్ రైలుపై ఆధారపడి జీవనం సాగిస్తున్న హాకర్ల కుటుంబాలను ఆదుకోవాలి. హాల్ట్ కోసం ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలి.

– ఎస్‌కే నాగూల్‌మీరా, మాజీ ఎంపీటీసీ, రెడ్డిగూడెం

ఇరవై గ్రామాలకు ఉపయోగం



హాల్ట్ కల్పిస్తే ఇరవై గ్రామాలకు చెందిన ప్రజలకు మేలు జరుగుతుంది. రైల్వే అధికారులకు మాత్రం ఆదాయమే ముఖ్యంగా ఉంది. అనేక మంది ప్రజలు రైల్వే హాల్ట్ లేక ఇబ్బందులకు గురవుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. స్టేషన్‌ను అన్ని హంగులతో తయారు చేశారు. హాల్ట్ కల్పించాలని కోరుతున్నాం.

–ఎస్‌కే బాషా, మాజీ ఏఎంసీ డైరెక్టర్, రెడ్డిగూడెం

వెన్నుపోటు నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



క్రోసూరు: ఎన్నికల సమయంలో అలవికాని హామీలతో ప్రజలను మోసం చేసిన చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలకు నిరసనగా చేపట్టిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 4న క్రోసూరు 4 రోడ్ల సెంటర్‌లో జరగనున్న వెన్నుపోటు నిరసన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యాలయ ప్రతినిధి కె.సత్యరాజు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. నాలుగురోడ్ల సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి కార్యక్రమం ప్రారంభించనున్నట్లు చెప్పారు. అనంతరం తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేయనున్నట్లు చెప్పారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

యువత పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

సత్తెనపల్లి: యువత పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి, లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి సౌజన్యంతో పట్టణ నరసరావుపేటరోడ్‌లోని సాయికృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆవరణలో పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆటో డ్రైవర్లకు అవగాహనా సదస్సు, ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సదస్సులో ఎస్ఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పొగాకు యువత జీవితాలను, ఆరోగ్యాన్ని నిర్వీర్యం చేస్తుందని, దీనిని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ సాయికృష్ణ మాట్లాడుతూ పొగాకు వాడకం వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయన్నారు. పొగాకు ఉత్పత్తుల వల్ల సీఓపీడీ దీర్ఘకాలిక, ఊపిరితిత్తుల వ్యాధులు, లంగ్ క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా యువత సిగరెట్, పొగాకు వంటి అలవాట్లకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఉచిత వైద్య శిబిరంలో సుమారు 100 మందికి పైగా బీపీ, షుగర్, ఈసీజీ, ఊపిరితిత్తుల సామర్థ్యం పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మాతంగి సాంబశివరావు, బెల్లంకొండ నాగసాయిప్రసాద్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కిషోర్, కంభాల వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ సాయికృష్ణ పక్కన ఎస్ఐ పవన్‌కుమార్ తదితరులు

విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీయవచ్చు

రెంటచింతల: చిన్నారులలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు వేసవి శిక్షణ తరగతులు దోహదం చేస్తాయని బ్రహ్మకుమారీస్ రాజయోగా శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి తెనాలి రామకృష్ణ అన్నారు. స్థానిక ఓం శాంతి భవన్‌లో ఏడు రోజుల శిక్షణ తరగతులను ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శిబిరంలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, నృత్యం, సంగీతం, యోగాపై తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తెనపల్లి: విద్యుత్ లైన్ల మర్మమ్మతుల కారణంగా పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బజార్ ఏరియా, గుంటూరు మేస్త్రి బజార్, శ్రీలక్ష్మీ థియేటర్ ఏరియా, అంబేడ్కర్ నగర్, ఎస్‌ఎస్సీ కెనాల్ నగర్ ప్రాంతాల్లో ఈ నెల 2న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ పీబీ కిరణ్ ఆదివారం తెలిపారు. ఆయా ప్రాంత విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



సత్తెనపల్లి: పర్యావరణ పరిరక్షణలో భాగంగా జ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలంలోని మూడు గ్రామాల్లో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్న తరుణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం ద్వారా అవి త్వరితగతిన ఎదిగే అవకాశం ఉంటుందని, దానిలో భాగంగా అబ్బూరు, ఫణిదం, నందిగం గ్రామాల్లో సచివాలయాలు, ముఖ్య ప్రాంతాల్లో మొక్కలను నాటారు. అబ్బూరు గ్రామంలో ఓలేటి కుమారి, మర్రి శ్రీనివాసరావు, పులనాల బ్రహ్మయ్య, రుద్రపోగు కృష్ణ, చింతపల్లి గురవయ్య, ఫణిదంలో ఓలేటి గురవయ్య, బక్క జోజీ, నందిగంలో తెలుగు బాప్టిస్టు చర్చి సంఘ కాపరి బక్క సుబ్బారావు పాల్గొన్నారు.

వరిగడ్డి వాములు దగ్ధం

గురజాల రూరల్: వరిగడ్డి వాములు దగ్ధమైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. మండల పరిధిలోని చర్లగుడిపాడులో గ్రామానికి చెందిన వరికల్లు పూర్ణయ్యకు చెందిన ఐదు ఎకరాలకు చెందిన 280 వరి కట్టలు, సంగుల చిన చెన్నయ్యకు చెందిన 15 ఎకరాలకు చెందిన 700 వరికట్టలు ఆదివారం కాలిపోయాయి. రూ.లక్షకు పైగా ఆస్తినష్టం జరిగిందని బాధితులు తెలిపారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చారు. అప్పటికే పూర్తిగా కాలిపోయింది.

హెచ్‌ఎంలు బాధ్యతలు స్వీకరణ


ఆకుల సత్యనారాయణ



బీఎల్ పద్మావతి

గురజాల రూరల్: ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఆకుల సత్యనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరులోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా గురజాలకు వచ్చారు. గురజాలలోని ఇదే పాఠశాలలో 1996, 2000 సంవత్సరంలో పీడీగా విధులు నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా బీఎల్ పద్మావతి బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లిలోని హైస్కూల్ నుంచి ప్రమోషన్‌పై గురజాలకు వచ్చారు. వీరిని పలువురు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటివద్దకే సరుకులు

రెంటచింతల: మండలంలోని వృద్ధులకు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దకే నిత్యావసరాలు అందజేయనున్నట్లు తహసీల్దార్ దొప్పటపూడి మేరికనకం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆదివారం మండల పరిధిలోని రేషన్ షాపుల వద్ద నుంచి రైస్ కార్డు లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ పిన్నం బ్రహ్మయ్య, వీఆర్వోలు నాసరయ్య, రేఖ, విగ్నేష, నాసర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, మాజీ పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ బి.రామకృష్ణ, నాయకులు మూలి రాజారెడ్డి, మర్రి కుమార్, ఒ.ఇన్నారెడ్డి, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీరాంజనేయులుకు డాక్టరేట్



రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లకు చెందిన అధ్యాపకుడు గోపు వీరాంజనేయులు కర్నాటక రాష్ట్రంలోని బెల్గావి విశ్వేశ్వరాయ టెక్నాలజికల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించారు. మైక్రో గ్రిడ్ నియంత్రణ వ్యూహాల పనితీరు మూల్యాంకనం అనే అంశంపై వీరాంజనేయులు సమర్పించిన పరిశోధన పత్రానికి డాక్టరేట్ లభించింది. వీరాంజనేయులు ప్రస్తుతం గుంటూరు ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. డాక్టరేట్ పొందిన వీరాంజనేయులును రొంపిచర్లకు చెందిన పలువురు గ్రామ పెద్దలు, తదితరులు అభినందించారు.

ప్రజలకు ఇబ్బందులు రాకుండా సరుకుల పంపిణీ

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: ప్రజలకు ఏ ఇబ్బంది రాకుండా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 14, 21 వార్డుల్లో చౌక ధరల దుకాణాలను ఆదివారం ఆయన పునః ప్రారంభించారు. ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీ పునః ప్రారంభానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజల బాధలను ప్రభుత్వం గుర్తించిందన్నారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగులకు డీలర్ల ద్వారా ఇంటి వద్దనే రేషన్ సరుకులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి నెల 1వ తేదీ నుంచి 15 వరకు రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంటాయని, లబ్ధిదారులు తమకు అనుకూలమైన సమయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా నిత్యావసర సరుకులు తీసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, నాయకులు యెల్లినేడి రామస్వామి, దరువూరి నాగేశ్వరరావు, సర్వేపల్లి సీతారామాంజనేయులు, షేక్ మస్తాన్‌వలి, పోతుగంటి రామ కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.


రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

అక్రమాలను అరికట్టేందుకే చౌక డిపోల వద్ద రేషన్ పంపిణీ

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు: ఇంటింటికీ రేషన్ పంపిణీలో జరిగిన అక్రమాలను అరికట్టేందుకే చౌక డిపోల వద్దనే రేషన్ పంపిణీ చేపట్టినట్లు పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం ఆయన రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. క్రోసూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన రేషన్ పంపిణీ చేసి మాట్లాడుతూ ఇంటి వద్దకే రేషన్ పంపిణీ పేరుతో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని, వాటిని అరికట్టేందుకే ఇంటి వద్దకే రేషన్ పంపిణీని కూటమి ప్రభుత్వం నిలిపివేసిందని, పాత విధానాన్ని తిరిగి చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటి నుంచి రేషన్ షాపుల వద్దనే పంపిణీ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


రేషన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం



చిలకలూరిపేటటౌన్: మండలంలోని మండలం బొప్పూడి గ్రామం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం బొప్పూడి వెంకటేశ్వర్లు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో ఈ ఏడాది మార్చిలో ప్రకటించిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 500 మార్కులు పైగా సాధించిన 14 మంది విద్యార్థులకు రూ.25వేల నగదు బహుమతులు, జ్ఞాపికల్ని అందించారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లును పాఠశాల స్థలదాతలు యోగేశ్వరరావు, మణి ప్రసాద్, మస్తానయ్య, మాజీ సర్పంచి హరిబాబు, సోంబాబు, కోటేశ్వరరావు, యడ్లపాడు ఏఎస్ఐ రవిచంద్రబాబు, ఎస్ఎంసి చైర్మన్ క్రాంతికుమార్‌లు అభినందించారు.

చిమ్మినేనికి ఘనసన్మానం



నాదెండ్ల: కుటుంబ పెద్ద నడవడికతో కుటుంబ సభ్యుల ఎదుగుదలకు కారణమవుతుందని ఈఓపీ ఆర్డీ నిర్మలలక్ష్మీకుమారి చెప్పారు. గణపవరం సచివాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ చిమ్మినేని రవీంద్రబాబు ఉద్యోగ విరమణ గావించిన సందర్భంగా గ్రామంలోని మండలనేని లక్ష్మయ్య కల్యాణ మండపంలో రవీంద్రబాబు దంపతులను సచివాలయ సిబ్బంది శాలువాలు, పూలమాలలతో సత్కరించి మెమొంటో అందించారు. సభకు పంచాయతీ కార్యదర్శి మారుతీబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ, రవీంద్రబాబు 38 ఏళ్ళ ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించారన్నారు. ఆయన స్వగ్రామం రొంపిచర్ల మండల గోగులపాడుతో పనిచేస్తూ పలు గ్రామాల్లో బాధ్యతలు నిర్వర్తించారన్నారు. కార్యక్రమంలో నాదెండ్ల పంచాయతీ కార్యదర్శి మక్కెన సుబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్యశిబిరం

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం జ్ఞాన మందిరం ప్రాంగణంలో ఆదివారం ఉచిత హోమియో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం, శ్రీ వాసవి సేవా సంఘ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో హోమియో వైద్యులు కుప్పాల సాయిజగదీశ్వరి పాల్గొన్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించారు. ముందుగా వైద్యశిబిరానికి హాజరైన రోగులకు వివిధ రకాల జబ్బుల లక్షణాలు, హోమియో వైద్యంతో వాటి శాశ్వత నివారణ చేసుకునే అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం 100 మందికి పైగా రోగులను పరీక్షించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్య సేవలందించిన డాక్టర్ కుప్పాల సాయి జగదీశ్వరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీ సేవా సంఘ్ అధ్యక్షుడు కొత్త కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రాచమల్లు సూర్యరావు, కోశాధికారి భవనాశి కోటేశ్వరరావు, చేవూరి కృష్ణమూర్తి, ఆలపాటి కాలేషా, కొత్తూరి కృష్ణకుమార్, కుప్పాల గౌరీశంకర్, బాలనాగు సాంబశివరావు, కొప్పులవూరు రాధాకృష్ణ, మేళ్లచెరువు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


వైద్యశిబిరంలో సేవలు అందిస్తున్న డాక్టర్ కుప్పాలసాయి

రేపటి ఆయుర్వేదంపై జాతీయ సెమినార్

గుంటూరు మెడికల్: ఆయుర్వేద వైద్యులకు నేషనల్ లెవెల్ సెమినార్, శిక్షణ కార్యక్రమం స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల పొత్తూరులో విశ్వాయుర్వేద పరిషత్ ఆంధ్రప్రదేశ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల చైర్మన్, చీఫ్ ఫిజీషియన్ డాక్టర్ కేఎస్ఎన్ గోపాలన్ తెలిపారు.

ఆదివారం స్థానిక సాలిపేటలోని స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డాక్టర్ గోపాలన్ మాట్లాడుతూ జూన్ రెండో తేదీ నుంచి 6 వరకు అనేక అంశాలపై వైద్యులకు, ఆయుర్వేద వైద్య విద్యార్థులకు శిక్షణ, హాండ్స్ ఆన్ ట్రైనింగ్ జరుగుతుందన్నారు. పంచకర్మ, ఆయుర్వేదిక్ సర్జరీ, గర్భచికిత్స, మర్మ చికిత్స, నాడి చికిత్స, బేసిక్ లైఫ్ సపోర్ట్, అంటిజం, క్యాన్సర్ చికిత్స తదితర ఆయుర్వేద చికిత్సలపై శిక్షణ, హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ ఇస్తున్నట్లు వెల్లడించారు. జాతీయస్థాయిలో జరుగుతున్న సెమినార్‌కు దేశం నలుమూలల నుండి వైద్యులు వస్తున్నారని తెలిపారు. విలేకరుల సమావేశంలో స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ చైతన్య, ప్రెసిడెంట్ డాక్టర్ మాధవరావు చౌదరి, విశ్వ ఆయుర్వేద పరిషత్ ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ సాహితి పాల్గొన్నారు.

రేషన్ పంపిణీకి సర్వర్ కష్టాలు

- తొలిరోజే గంటల తరబడి నిరీక్షణ
- ఆందోళనలో కార్డు దారులు

గురజాల: రేషన్ పంపిణీలో ప్రభుత్వం మార్పులు తెచ్చింది. ఇంటింటికి పంపిణీని నిలిపివేసి రేషన్ దుకాణాల వద్ద పంపిణీకి ఆదివారం శ్రీకారం చుట్టారు. తొలి రోజే లబ్ధిదారులకు కష్టాలు తప్పలేదు. సర్వర్లు మొరాయించాయి. లబ్ధిదారులు గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి కనిపించింది.

నియోజకవర్గంలో ఇలా..

గురజాల నియోజకవర్గంలో నాలుగు మండలాలు ఉన్నాయి. సుమారుగా గురజాలలో 38, దాచేపల్లిలో 42, మాచవరంలో 38,పిడుగురాళ్ల 79 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అదే విధంగా గురజాలలో 21,396, దాచేపల్లిలో 22,689, మాచవరంలో 16,271, పిడుగురాళ్లలో 44,020 రేషన్ కార్డుదారులున్నారు.ఇంటింటికి తిరిగి రేషన్ పంపిణీ చేసేందుకు గాను గత ప్రభుత్వం హయాంలో గురజాలలో 14, దాచేపల్లిలో 15, మాచవరంలో 11, పిడుగురాళ్లలో 24 ఎండీయూ వాహనాలు ఏర్పాటుచేసి ఇంటింటికి రేషన్ అందించారు. దీంతో ఎటువంటి అవకతవకలు జరగకుండా ప్రతి ఒక్కరికి సరుకులు అందాయి. కానీ నేడు ఆ విధానాన్ని తొలగించి రేషన్ డిపోల వద్దకు వెళ్లి తీసుకునే విధంగా చర్యలు చేపట్టారు.


గురజాలలో రేషన్ దుకాణం వద్ద వేచివున్న కార్డుదారులు

ఇబ్బందులు పడాలి



గతంలో ఇంటి వద్దకు వచ్చి రేషన్ సరుకులు ఇచ్చేవారు. నూతన విధానం వలన గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. సుమారుగా గంటకు పైగా సర్వర్ రాకపోవడంతో కూర్చోవాల్సి వచ్చింది. ఈ విధానం వలన వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడాల్సివస్తుంది. సర్వర్ సరిగ్గా వుండేలా చూస్తే ఈ ఇబ్బందులు లేకుండా పోతాయి. వృద్ధులు, వికలాంగులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– పాపిరెడ్డి, గురజాల